క్లుప్తంగా

‘మీ కోసం’లో ఫిర్యాదుపై విచారణ



కొత్తచెరువులో అక్రమంగా తవ్విన చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఆకివీడు: మండలంలోని కొత్త చెరువు ప్రాంతంలో అక్రమంగా చెరువు తవ్వారని మీ కోసంలో చేసిన ఫిర్యాదు మేరకు శనివారం ఆ ప్రాంతాన్ని తహసీల్దార్ వెంకటేశ్వరి, ఏఓ ప్రియాంక పరిశీలించారు. సిద్ధాపురం గ్రామానికి చెందిన భూపతిరాజు రామ్మూర్తిరాజు చేసిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. ప్రస్తుతం చెరువులో చేపలు, రొయ్యల సాగు లేకుండా ఖాళీగా ఉందని చెప్పారు. దీనిపై నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ



దుంపగడపలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: అతిసార (డయేరియా) ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరుతూ శనివారం దుంపగడప గ్రామంలోని తిమ్మరాజు కాలనీలో ఆరోగ్య సిబ్బంది అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శన జరిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఓఆర్ఎస్, జింక్ మాత్రలు ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లిపాలు ప్రాముఖ్యత, వక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆదర్శనీయుడు



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: దేశ సమైక్యత కోసం అహర్నిశలు కృషి చేసిన శ్యాంప్రసాద్ ముఖర్జీ అందరికీ ఆదర్శనీయుడని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, కాయిత సురేంద్ర, పితాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయ వాద నేతల్లో ముఖ్యుడని, 1951లో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించి ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు, గోవర్ధన్, అడబాల శివ, మణికంఠ వెంకటేష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



భీమవరంలో రగ్గులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు తదితరులు

భీమవరం: సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలో శంకరమఠం వద్ద మీసాల నాగదేవి, కరణం కల్యాణి, నిమ్మల అన్నపూర్ణమ్మ, బోడపాటి పెదబాబు, రాట్నాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో 75 మంది వికలాంగులు, దివ్యాంగులకు ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా రగ్గులు పంపిణీ చేశారు. మీసాల నాగదేవి మాట్లాడుతూ రానున్న శీతాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వికలాంగులు, దివ్యాంగులకు రగ్గులు పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నమల చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యులు గుండా జయప్రకాష్ నాయుడు, గనిరెడ్డి త్రినాథ్, విజ్జురోతి రాఘవులు, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలి

పెనుగొండ: పారిశుద్ధ్య నిర్వహణపై ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి అన్నారు. శనివారం పెనుగొండలో పారిశుద్ధ్య నిర్వహణ యాక్షన్ ప్లాన్ నిర్వహణపై జరిగిన ప్రత్యేక సమావేశంలో సర్పంచ్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి టి రత్నాకరరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

పాలకోడేరు మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ చంటి రాజు

పాలకోడేరు: పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలని ప్రజాప్రతినిధులను ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) కోరారు. పాలకోడేరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ చంటిరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు నిలిచిన అభివృద్ధి పనులు ఇక నుంచి జరగాల్సిన అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపడతామని అందరూ సహకరించాలని కోరారు. విస్సాకోడేరు గ్రామ సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని లంబాడి వుంత అనుకుని ప్రవహిస్తున్న పంట కాలువకు నీరు విడుదల అయ్యే సమయంలో బలహీనంగా ఉండడం వల్ల నివాసిత ప్రాంతాల్లోకి నీరు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రామంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, దీనివల్ల ఇబ్బందులకు గురవుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు నెలలకోసారి జరిగే ఈ సర్వసభ్య సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనడం లేదని అధికారులందరూ పాల్గొనే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీ తులసి మాట్లాడుతూ గ్రామంలో రెండు చోట్ల ఇనుప విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వర్షాలు కురిసేటప్పుడు నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని, దీనిపై చర్యలు చేపట్టాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అధికారులు చర్యలు చేపడతామని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సోడదాసి నరేష్, పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.



పాలకోడేరు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

ఆకివీడు: స్థానిక సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, 11 కేవీ లైన్‌లో చెట్లకొమ్మల తొలగింపు వంటి పనుల వల్ల ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఆకివీడు టౌన్, సమతానగర్, అజ్జమూరు, దుంపగడప, అయిభీమవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంత్రుల దృష్టికి వినియోగదారుల సమస్యలు

ఆకివీడు: కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌లను శనివారం వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య కలిసి వినియోగదారుల సమస్యలను వివరించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక విలేకరులకు శనివారం వివరాలు వెల్లడించారు. వినియోగదారులు సమస్యలపై మంత్రులకు వివరించి, స్పందించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: వాంద్రం గ్రామంలో గత నెల జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఓ వ్యక్తి గుంటూరులో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాంద్రం గ్రామానికి చెందిన కనపాల సింహాద్రి (42) అనే వ్యక్తి గత నెల 27వ తేదీన గ్రామంలోని రజకపేట వద్ద కాలువ గట్టుపై చెట్టు కొడుతుండగా ప్రమాదవశాత్తు కొమ్మ వచ్చి అతని మెడమీద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. అయితే మెరుగైన వైద్యం కోసం అతనిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అక్కడే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారంతో మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్సై సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బధిర విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: అవయవ లోపంతో మూగ, చెవుడుతో తల్లిదండ్రులకు భారంగా ఉన్న తరుణంలో తిరుమల తిరుపతి దేవస్థానం బధిర పాఠశాలను స్థాపించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని, భీమవరం బధిర పాఠశాల విద్య విషయాల్లో ముందుండటం గొప్ప విషయమని కేజీఆర్ఎల్ కళాశాల కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర బధిర పాఠశాలలో 80 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, నూతన వస్త్రాలను అందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ తిరుమలరావు మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు ఎంతోమంది సదుపాయాలను కల్పిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ బధిర పాఠశాలలో భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు సతీమణి సత్యవాణి అందించిన నోట్ పుస్తకాలను అందించామని, మిగిలిన పుస్తకాలను పలు కళాశాల, హాస్టల్స్‌లో అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, ఉపాధ్యాయులు విజయ, హరిప్రియ, గాయత్రీ, పద్మ, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డయేరియా ప్రబలకుండా విస్తృత చర్యలు

ఉండి: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సహజ ప్రసవాలను పోత్సహించి అక్కడే ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డీ మహేశ్వరరావు అన్నారు. శనివారం ఉండి మండలం యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ డయేరియా ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను ఆయన పరిశీలించి పీహెచ్‌సీ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వర్షాకాలంలో అతిసార వ్యాధి విజృంభించకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రజలందరికీ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఐదేళ్లలోపు చిన్నారులను సర్వే చేసి వారిని గుర్తించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తారన్నారు. వారికి విరేచనాలు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తితే వారికి చికిత్స అందిస్తారన్నారు. అలాగే ప్రతి చిన్నారికీ ఓఆర్ఎస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 14 రోజులపాటు జింక్ ట్యాబ్లెట్స్ అందజేస్తామన్నారు. అతిసార వ్యాధి ప్రబలకుండా రోటా వైరస్ ఇంజెక్షన్లు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి పాఠశాలలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ కార్యక్రమం ఆగస్టు 31వ తేదీ వరకు 60 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు అందించడంతో పాటుగా అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో క్రిమిసంహారక మందును పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు డీ బెన్నీసామ్యూల్, ఐసీ కీర్తన, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



యండగండి పీహెచ్‌సీ వద్ద స్టాప్ మలేరియా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహేశ్వరరావు

వారాహి దేవి అమ్మవారికి అభిషేకాలు

ఆకివీడు: శక్తి రూపాల్లో ఒకటైన వారాహి దేవి అమ్మవారికి స్థానిక పిల్లల మర్రి అగ్రహారంలోని వేంకట లింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. భక్తుల వారం రోజుల పాటు నిష్టగా పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వారాహి అమ్మవారి కంకణంను అర్చకులు సుబ్రహ్మణ్య రవి దీక్షా కంకణం కట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు శక్తి రూపాల్లో ఒకటని అర్చకులు రవి తెలిపారు. అమ్మవారి మూల మంత్రం చదివి భక్తులకు వినిపించారు. మంత్రాన్ని రోజులో మూడు, 21, 108 సార్లు 48 రోజుల పాటు జపించడం వల్ల సర్పదోషాలు, సకల దోషాలు పోతాయని శాస్త్రాలు చెబుతున్నాయని ఆయన వివరించారు.



వెంకట లింగేశ్వరస్వామి ఆలయంలో వారాహి దేవి అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం

డిమాండ్స్ డేను విజయవంతం చేయాలి

భీమవరం: తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఈ నెల 10వ తేదీన నిర్వహించే డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను మార్చి యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. స్కీమ్ వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించాలని గోపాలన్ డిమాండ్ చేశారు. ఈనెల 10న తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించే డిమాండ్స్ డేలో స్కీమ్ వర్కర్స్, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గోవిందమ్మ, ఇంజేటి శ్రీనివాస్, కె విశాలాక్షి, మదీనా బేబీ, తోటి శుభకర్‌రావు, టి మణి తదితరులు పాల్గొన్నారు.

జూలై 10న డిమాండ్స్ డే

ఆకివీడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల పొట్టకొట్టే విధానాలతో చట్టాల్ని అమలుజేయాలని చూస్తోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బీ.వాసుదేవరావు ఆరోపించారు. స్థానిక సంఘ కార్యాలయంలో శనివారం బజారు ముఠా వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్‌ను అమలుజేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఓల్డ్ పెన్షన్ స్కీమును అమలుజేయాలని, విశాఖ స్టీలు ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చర్యల్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన డిమాండ్స్ డేను అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్మికులు కార్యక్రమాల్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్, కె.తవిటినాయుడు, మనిపూరి సత్యం, బీ.అప్పలనాయుడు, పంపన రమణ పాల్గొన్నారు.



డిమాండ్స్‌డే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న బి.వాసుదేవరావు

పిల్లలు ఇష్టంగా చదవాలి

ఆకివీడు: పిల్లలు ఇష్టంతో చదివి, మంచి భవిష్యత్‌కు బాట వేసుకోవాలని సర్పంచ్ చెలంకూరి చలపతిరావు పిలుపునిచ్చారు. మండలంలోని అజ్జమూరు గ్రామ శివారు గరువు ప్రాంతంలోని ఎంపీపీ స్కూల్‌లో యూనిఫాం మెటీరియల్‌ను శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని చదువు విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వంటిదన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆర్వీ.నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యూనిఫాం పంపిణీ చేస్తున్న సర్పంచ్ చలపతిరావు

కోపల్లె హైస్కూల్‌లో ఆటపాట

కాళ్ల: విద్యార్థుల మనోవికాసానికి, క్రమశిక్షణకు నృత్యం ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు అందరూ ఉత్సాహంగా నేర్చుకోవాలని కాళ్ల మండల ఎంఈఓ.2 కనకరాజు అన్నారు. కొపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోపల్లె విద్యార్థులకు ఆటపాట కార్యక్రమం ద్వారా నృత్య శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 40 మంది బాలబాలికలు పాల్గొని నృత్యాలను అభ్యసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మలాదేవి, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ పేరిచర్ల అశోక్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ ఆచారి, వందేమాతరం ఫౌండేషన్ కల్చరల్ కో-ఆర్డినేటర్ బైరోజు బ్రహ్మాచారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ సుబ్బరాజు, స్టాఫ్ సెక్రటరీ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



ఆటపాట కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

రహదారులపై తొలగని వర్షపు నీరు



మొగల్తూరు-గొల్లగూడెం రోడ్డులో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

మొగల్తూరు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 29, 30 తేదీల్లో 61.2 మిల్లీమీటర్లు, ఈనెల 3న 35 మిల్లీమీటర్లు, 5న 35.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో మొగల్తూరులోని ప్రధాన రహదారులైన గొల్లగూడెం రోడ్డు, స్టేషన్‌రోడ్డు, రామాలయం నుంచి కోట మీదుగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారిలో వర్షపు నీరు నిలిచిపోయింది. అసలే భారీ గోతులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు వాటిలో వర్షపు నీరు చేరడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్లపై గోతులను వెంటనే పూడ్చించి వాహనదారుల ఇక్కట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: నరసాపురం బస్టాండ్ వద్ద డ్రెయిన్‌పై సిమెంట్ పలకలు లేకుండా ప్రమాదకరంగా ఉంది. నిత్యం వేలాది మంది ఈ మార్గం గుండా ప్రయాణిస్తారు. అలాంటి ఈ మార్గంలో పరిస్థితి ఇంత ప్రమాదకరంగా ఉన్నా, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల బస్టాండ్ పక్కనున్న డ్రెయిన్‌ను బాగు చేసి, సిమెంట్ పలకలు పక్కకు తీశారు. పని పూర్తయిన తరువాత, తిరిగి వాటిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. డ్రెయిన్‌పై మూతలు లేకపోవడంతో అనేక మంది, గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఈ డ్రెయిన్ పూర్తిగా శిథిలమైంది. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మూతలు లేకుండా బస్టాండ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న డ్రెయిన్

పూడుకుపోయిన డ్రెయిన్

నరసాపురం: స్థానిక రాయిపేటలో డీసీసీబీ బ్యాంకు రోడ్డులోని డ్రెయిన్ పూడుకుపోయి మురుగుపారడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో మునిసిపల్ అధికారులు డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టారు. ఈ పనులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. డీసీసీబీ బ్యాంక్ రోడ్డులో పలు విద్యాసంస్థలుండగా, ఇటుగా వెళ్లేవారు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. డ్రెయిన్‌లో పూడిక తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.